**'ఛ... ఎంత అవమానం జరిగింది! రాత్రంతా సరిగా నిద్రపట్టలేదు. హోటల్ గేటు దగ్గరే తన్నాపేయడం చూసినా చూడనట్లే వెళ్ళిపోయారు ఒకళ్ళిద్దరు.**

**వాళ్ళు అందరికి చెబుతారు అందరూ నవ్వుకుంటారు. దొంగ వెధవలు, పైకి అందరూ సంస్కారవంతుల్లా నటిస్తారు'**

**"హాస్పిటల్‌కి వెళ్ళరా? అలా కూర్చున్నారు?" అడిగింది రాణి.**

**"వెళ్తాన్లే!" విసుగ్గా అన్నాడు చంద్రమోహన్.**

**"రాత్రి జరిగిందాని గురించే ఇంకా బాధపడుతున్నారా?"**

**"బాధ కాదా? ఈవేళ హాస్పిటల్‌లో ఇదో హాట్ న్యూస్. చిలవలు పలవలు చేర్చి చెప్పుకొని తనివిదీరా నవ్వుకుంటారు"**

# అవమానం



"ఏదోవిధంగా మనమూ కారు కొనుక్కోవాలండీ! కారుంటే ఈ అవమానం జరక్కపోను"

"ఎలా కొంటాం. జీతం ఇంటి ఖర్చుకే సరిపోతోంది. ప్రాక్టీసునామమాత్రంగా ఉంది. పోనీ నీ డబ్బులోంచి కొందామంటే మీ నాన్న ఇచ్చి చావడు. అంతా నా ఖర్మ."

"ఈ మాత్రం దానికంత మాటెందుకండీ! లేచి స్నానానికెళ్ళండి. టైమవుతోంది!"

"నీకు మా వాళ్ళ సంగతి తెలీదు" ఆ హోటల్ పెట్టి సంవత్సరమయింది కదా! ఇంతవరకూ ఆ హోటల్‌కి వెళ్ళలేదా?" అని కూడా అడుగుతారు" అంటూ లేచాడు.

** ** **

"రాత్రి పార్టీకి రాలేదేం?" అడిగాడు చీఫ్ సుబ్బారావు.

ఆయన మొహంలోకి చురుగ్గా చూశాడు చంద్రమోహన్. ఆ మొహంలో ఎటువంటి భావమూ కన్పించలేదు. 'నా గోడవెందుకీయనకి. ఈయన డొక్కు కారు నా బైక్ ఖరీదు చేయదు. ఆయన్నెవడూ ఆపడు. ఆపినా పట్టించుకోడు. చాదస్తం తప్ప మరే గుణంలేదీ ముసలోడికి' అనుకుంటూ "చిన్న ఇబ్బందివల్ల రాలేకపోయాను సార్" అని చెప్పి బయటకు వెళ్ళబోయాడు.

"ఆ... మోహన్... మూడోనెంబరు బెడ్ మీదున్న నా పేషెంటు నోసారి చూడు. కాంప్లికేటెడ్‌గా ఉంది కేసు. డిస్కస్ చేద్దాం!"

'అదే ఈయనలో నచ్చే గుణం. అస్సలు అహంకారం లేదు. తనలాంటి జూనియర్‌ని ఎవరూ సంప్రదించరు. వాళ్ళకు తోచిందేదో చేస్తారుగాని' అనుకుంటూ వార్డులోకి నడిచాడు.

పన్నెండవుతుండగా జంకుతూనే కాంటీన్‌కెళ్ళాడు. నలుగురైదుగురడిగారు 'పార్టీకిరాలేదే'మని. అలా అడుగుతున్నపుడు వాళ్ళ మొహాల్లో ఏదో పైశాచికానందం కనిపించింది చంద్రమోహన్‌కు. 'శాడిస్టు వెధవలు' అని మనసులో తిట్టుకొని పైకిమాత్రం నవ్వేసి ఊరుకున్నాడు.

అదే సమయంలో రాత్రి పార్టీకాహ్వానించిన గోవింద్ వచ్చాడు. రావడంతోనే చంద్రమోహన్‌ని ఓ మూలనున్న టేబుల్ దగ్గరకు లాక్కెళ్ళి "సారీరా చంద్రా! ఇలా జరుగుద్దనుకోలేదు. నీకు కారు లేదన్న సంగతి తట్టలేదు. కారు పంపి ఉండాల్సింది! అయామ్ వెరీవెరీ సారీ!" అన్నాడు. చంద్రమోహన్ గోవింద్ మొహంలోకి సూటిగా చూశాడు. గోవింద్ నిజంగానే ఫీలవుతున్నాడనిపించింది. "ఇట్సాల్‌రైట్ నువ్వుమాత్రం ఏంచేస్తావు!"

"నేనో మాటంటాను ఏమీ అనుకోవకూదూ!" అంటూ ఆగాడు గోవింద్.

"చెప్పు"

"ఈరోజుల్లో మెళ్ళో స్టెత్ ఉన్నా కారు లేకపోతే కాంపౌండరనే అనుకుంటున్నారు జనం. మన హాస్పిటల్‌లోనే చూడు, నువ్వూ, పిసినారి విశ్వనాథం, రాడికల్ రమణమూర్తి- మీ ముగ్గురికే కార్లు లేవు. మిగతా అందరికి ఏదో ఒక కారుంది. నామాట విని వెంటనే కారు తీసుకో!"

"ఎలారా? నా ప్రాక్టీసు అంతంత మాత్రమని నీకు తెలియదా? కారు ఫైనాన్స్ ఎలా కట్టను? కారు మెయింటెనెన్స్ ఎలా?"

## రావు కృష్ణారావు

"నీ ప్రాక్టీసు ఎందుకు పుంజుకోవడంలేదంటావు? అసిస్టెంట్స్ అందరిలోనూ నీ డయగ్నోసిస్, ట్రీట్‌మెంట్ బాగుంటాయని అందరూ అంటారు. మీ చీఫ్ కూడా అనడం విన్నాను. అయినా నీ ప్రాక్టీసు పెరగకపోవడానిక్కారణం నువ్వు లోకం తీరుతెన్నులనూ, పేషెంట్ల సైకాలజీని పట్టించుకోకపోవడమే!

"అదేమిటి?" చంద్రమోహన్ కొంత ఆశ్చర్యంగా అన్నాడు.

"నువ్వు ఎఫీషియంట్ అయితే చాలదు. నీ అప్పియరెన్స్ కూడా బాగుండాలి. ఈ డ్రస్ ఏమిటి? ఇలాంటివి నీ చీఫ్ సుబ్బారావులాంటి వాడు తొడిగినా ఫరవాలేదు. ఆయన్నెరగని వాడుండడీ టవున్లో. మన కలా కుదరదు. గొప్పవాడు సింపుల్‌గా ఉంటే మహాత్ముడంటారు. మనలాంటివాడు సింపుల్‌గా ఉంటే సన్నాసంటారు."

"నా బట్టలకి పేషెంట్స్‌కి సంబంధం ఏమిటి?" కొంత అసహనంగా అన్నాడు చంద్రమోహన్.

"నువ్వొట్టి అమాయకుడివిరా చంద్రా! ఎవరెన్ని చెప్పినా పై హంగులకి చాలా విలువుంది లోకంలో. సింపుల్‌గా ఉండేవాడు కూడా హడావుడికి ఎంతో కొంత అట్రాక్ట్ అవుతాడు."

"అయితే నన్నేం చేయమంటావు?"

"అర్జెంటుగా డ్రస్ మార్చెయి. గోల్డ్‌వాచ్, గోల్డ్‌ఫ్రేం కళ్ళజోడు తీసుకో. మంచి మోడరన్ షూ కొను. ఇన్‌షర్ట్ చేయి. సెల్‌ఫోనొకటి తీసుకో!" చెబుతున్నాడు గోవింద్.

"ఇంకా..." నవ్వుతూ అన్నాడు చంద్రమోహన్.

"నేను సీరియస్‌గానే చెబుతున్నా. నీ ట్రీట్‌మెంట్ కూడా మార్చాలి!"

"ఇపుడే కదా నా ట్రీట్‌మెంట్ బాగుంటుందన్నావు. మళ్ళీ అదికూడా మార్చాలంటున్నావు?" చిరాకును అదుపు చేసుకుంటూ అన్నాడు చంద్రమోహన్.

"కోప్పడకు. నేను చెప్పేది శాంతంగా విను. నువ్విక్కడ ఓ.పి.లో ఇచ్చినట్టు సింగిల్ డ్రగ్ ప్రిస్క్రిప్షన్ బయటిస్తానంటే కుదరదు. ఇక్కడ పేషెంటుకి ఛాయిస్ లేదు. అందుచేత ఒప్పుకుంటాడు. బయట మనకు ఫీజు ఇచ్చే పేషెంటు అలా సరిపెట్టుకోడు. ఇమ్మీడియట్ రిలీఫ్ కావాలి. అంతేకాదు ప్రతీవాడూ తన గోరుచుట్టు కూడా గుండెపోటు కంటే ప్రమాదకరమైనదనే ఫీలింగ్‌తో ఉంటాడు. మనమూ అలాగే నటించాలి."

చంద్రమోహన్ ఆలోచిస్తున్నాడు.

చంద్రమోహన్ మొహంలోకి పరిశీలనగా చూస్తూ నెమ్మదిగా చెప్పాడు గోవింద్- "నేను చెప్పినట్టు కొద్దిగా మారతానంటే నీ సమస్యలు తీరిపోయే మార్గం నేను చెబుతాను"

ఓ క్షణం మౌనంగా ఉండి "ఏంటో చెప్పు" అన్నాడు చంద్రమోహన్.

"జయా నర్సింగ్‌హోమ్ వాళ్ళకి కన్సల్టెంట్ ఫిజీషియన్ కావాలి. రత్తయ్యగార్కి ప్రమోషనొచ్చి వెళ్ళిపోయిం తర్వాత వాళ్ళకి ఫిజీషియన్ లేక ఇబ్బంది పడుతున్నారు"

"వాళ్ళు నన్ను డిక్టేట్ చేస్తారేమో!"

రత్తయ్యలాంటి దూర్వాసుడన్నాళ్ళు పనిచేసేడంటేనే తెలియడంలేదా వాళ్ళెంత గౌరవంగా చూస్తారో! వాళ్ళక్కావలసిందల్లా ఏ టైములో పిలిచినా వెళ్ళడం, మూడు అడ్మిషన్లు, ఆరు టెస్టులు అంతే! నీకు చాలా బాగుంటుంది. ఆలోచించు.

"సరే మాట్లాడు"

"వెరీగుడ్! ఈవేళే మాట్లాడతాను."

** ** **

చంద్రమోహన్ జయానర్సింగ్ హోమ్‌కెళ్ళడం మొదలెట్టి ఆర్నెల్లయ్యింది. చాలా బిజీ అయిపోయాడు. రాణి తండ్రినెలా ఒప్పించిందోగాని నాలుగు నెల్ల క్రితం కారు కొనిచ్చాడాయన.

** ** **

"సెమినార్‌కి రాలేదేం? ప్రొఫెసర్ మణి మంచి లెక్చరిచ్చాడు. మన సుధాకర్ మంచి పేపరు సబ్‌మిట్ చేశాడు" చీఫ్ అడిగాడు చంద్రమోహన్‌ని.

"పొద్దున్నే ఈముసలాడికి దొరికిపోయాన్రా బాబూ!" అనుకుంటుండగా "మునుపు సెమినార్‌లంటే ఎంత దూరమైనా వెళ్ళేవాడివి. ఇపుడు టవున్లో జరిగిందానికీ అటెండ్ కాలేదు?" మళ్ళీ సాగదీశాడు చీఫ్.

వదిలించుకోవాలనే ఉద్దేశంతో "సారీసర్!" అన్నాడు చంద్రమోహన్.

సారీ ఎందుకోయ్! అది నీ ఇష్టం. నువ్వూ మిగతా వాళ్ళలా తయారవుతున్నావనే బాధతో అంటున్నా అంతే!

అప్పటివరకూ విసుగ్గా ఉన్న చంద్రమోహన్ చీఫ్

మాటలకు అలెర్ట్ అయ్యాడు. "నాలో ఏమార్పు మీకు నచ్చలేదోచెప్పండి సార్ నేనేమీ అనుకోను."

"నీకు హాస్పిటల్‌లో మంచి పేరు రావడంవల్లే నిన్నా నర్సింగ్‌హోమ్ వాళ్ళు పిలిచారు. ఇన్నాళ్ళూ సబ్జెక్టు ఫాలో అవుతూ వచ్చావు కాబట్టి చాలా త్వరగా రాణించావు. కాని నువ్వు మన జర్నల్ చూసి ఎన్నాళ్ళయ్యింది? నీ ట్రీట్‌మెంట్ మారలేదా?

"నా ట్రీట్‌మెంట్ మారిందనుకోవడంలేదు."

చీఫ్ కొంత హేళనతో నవ్వి ట్రీట్‌మెంటు మారలేదంటున్నావుకదా! పూర్వం నీ ఓన్ క్లినిక్ వున్నప్పుడు పేషెంట్స్‌కి ప్రిస్క్రిప్షన్ ఎన్నిరోజులకిచ్చేవాడివి?

"త్రీడేస్‌కి"

నువ్వు ప్రిస్క్రైబ్ చేసిన డ్రగ్ పనిచేస్తుందో లేదో మూడురోజుల తర్వాత రివ్యూ చేసేవాడివి అవునా? మరిపుడెన్నిరోజులకిస్తున్నావు?

"టెన్ ఆర్ ఫిఫ్టీన్‌డేస్‌కి" ఎర్రబడుతున్న మొహంతో నసిగాడు.

"ఏది కరెక్ట్ అనుకుంటున్నావు? అంతేకాదు గతంలో ఎపుడైనా ఒకేసారి రెండు పెయిన్ కిల్లర్స్ రాశావా?"

జేవురించిన మొహంతో మౌనంగా ఉండిపోయాడు చంద్రమోహన్.

ఇపుడు నీవు ప్రతి పేషెంటునీ మూడురోజుల తర్వాత రమ్మంటే నువ్వు 24 గంటలూ పనిచేసినా చాలదు. బోల్డంత ఫీజు తీసుకుంటున్నావు కాబట్టి పేషెంటుకి ఇమ్మీడియట్ రిలీఫ్ రావడానికి ఓవర్ డ్రగ్గింగ్. లేకపోతే ఈ కాంపిటీషన్లో నిలబడలేవు. చూశావా పరిస్థితులు నిన్నెలా మార్చేస్తున్నాయో!

చీఫ్ సుబ్బారావుగారు ఎప్పుడూ తన గురించి ఇంత శ్రద్ధగా ఆలోచిస్తాడని అనుకోలేదు. ఆయన వైపు ఉద్వేగంతోనూ, అభిమానంతోనూ చూస్తూ మౌనంగా ఉండిపోయాడు చంద్రమోహన్.

"పరిస్థితుల ప్రభావం నుండి ఎవరూ తప్పించుకోలేరు. కొన్ని పరిస్థితుల్లో ఇరుక్కోకుండా జాగ్రత్తపడవచ్చు. నేను చెప్పేదేమిటంటే నీకేం కావాలో ఆలోచించు. నీ ఫస్ట్ ప్రయారిటీగా ఏముండాలో ఆలోచించి నిర్ణయించుకో. లేకపోతే గమ్యంలేని బతుకైపోతుంది. చుక్కానిలేని నావలా గాలివాటానికి కొట్టుకుపోతావు."

"కొంచెం వివరంగా చెప్పండి" అడిగాడు చంద్రమోహన్.

డబ్బు, కీర్తి, పలుకుబడి, వృత్తిపరమైన సంతృప్తి- వీటిలో నీకు ఏది ముఖ్యమో ఆలోచించి నిర్ణయించుకో. ఇవన్నీ కలిసే వస్తాయని చాలామందంటారు. నేనది అంగీకరించను. మరోటి ఏమిటంటే వీటన్నింటి మధ్యా మనిషిగా నీకంటూ ఓ జీవితం లేకుండా పోకూడదు. కుర్రాడివి ఇపుడే సరైన నిర్ణయం తీసుకో.

ప్రియ శిష్యునికి బోధిస్తున్న గౌతమ బుద్ధునిలా అనిపించాడా క్షణంలో.

** ** **

పక్క ఊరిలో ఓ డాక్టరు తన కొడుకు పుట్టినరోజు భారీ ఎత్తున చేస్తూ చంద్రమోహన్‌ని కూడా ఆహ్వానించాడు. రాణిని తీసుకొని కారులో బయలుదేరాడు. కారు ఊరి పొలిమేరలు దాటుతుండగా పోలీస్ కాని స్టేబుల్ ఆగమని సైగ చేయడం చూసి కారాపాడు. కానిస్టేబుల్ గుర్తుపట్టాడేమో "అన్నీ ఉన్నాయికదాసార్! మీరెళ్ళండి" అన్నాడు.

సరిగ్గా అదే సమయంలో "రికార్డు తీసుకొని వాడ్నిలా రమ్మను" అవధుల్లేని అధికారం, అహంకారం ధ్వనించే గొంతు బిగ్గరగా వినిపించింది. ఖంగుతిన్న చంద్రమోహన్ అటువైపు చూశాడు. రోడ్డుకవతలి వైపు ఖాళీ ప్రదేశంలో స్టాండు వేసిన బుల్లెట్ మీద కూర్చున్నాడు ఎస్.ఐ.

చంద్రమోహన్ మొహం కందగడ్డలా అయింది. రాణి వైపు చూడకుండా కారు పక్కకు తీసి సీబుక్, లైసెన్సు వగైరాలు తీసుకొని నెమ్మదిగా ఎస్.ఐ దగ్గరకెళ్ళాడు. ఎస్.ఐ చంద్రమోహన్‌ను పట్టించుకోకుండా అప్పటికే అక్కడున్నవారి లైసెన్సులు చూడసాగాడు. నెమ్మదిగా చాలామంది పోగుబడ్డారు. కొంతసేపటికి

**డబ్బు, కీర్తి, పలుకుబడి, వృత్తిపరమైన సంతృప్తి- వీటిలో నీకు ఏది ముఖ్యమో ఆలోచించి నిర్ణయించుకో. ఇవన్నీ కలిసే వస్తాయని చాలా మందంటారు. నేనది అంగీకరించను. మరోటి ఏమిటంటే వీటన్నింటి మధ్యా మనిషిగా నీకంటూ ఓ జీవితం లేకుండా పోకూడదు. కుర్రాడివి ఇపుడే సరైన నిర్ణయం తీసుకో.**

చంద్రమోహన్ అందించిన రికార్డు అందుకుంటూ "ఏరా! కారుదిగి రికార్డు చూపించలేకపోతున్నావా?" అన్నాడు.

చంద్రమోహన్ నెత్తిన పిడుగుపడ్డట్లయ్యింది. అతని మెదడు మొద్దుబారిపోయింది. వంట్లోని రక్తమంతా మొహంలోకి వచ్చినట్లైంది. మాట రాలేదు. సిగ్గుపడి మొహం దించుకోవాలని కూడా తోచలేదతనికి. చిన్న కలకలం మొదలైంది. నమస్కారం సార్... నమస్తే సార్... నమస్తే... ఇలా వినబడుతుంటే ఎస్.ఐ. బుల్లెట్ మీద నుండి దూకినట్లుగా దిగి వినయంగా "నమస్కారం సార్" అన్నాడు ఎస్.ఐ.

అంత వినయంగా నమస్కరిస్తున్నదెవరికా అని ఆశ్చర్యపోతూ చంద్రమోహన్ వెనక్కి తిరిగి చూశాడు. ఓ ముసలాయన తన మోపెడ్ నడిపించుకుంటూ అందరి నమస్కారాలకూ తలపంకిస్తూ వస్తున్నాడు. ఆయనెవరా? అని పరిశీలనగా చూశాడు చంద్రమోహన్. ఆ... గుర్తుకొచ్చింది. ఈయన డాక్టరు విష్ణుమూర్తిగారు. ఈయనకోసారి డాక్టర్లంతా సన్మానం చేశారు. అపుడు చూశాడు. ఈ టవున్లోనేకాక చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఆయన్ను దేవుడంటారు.

"నీకు బుద్ధిలేదూ! సార్‌నెందుకాపావు?" విష్ణుమూర్తిగారి వెనకాలే నడచి వచ్చిన కానిస్టేబులునుద్దేశించి కోపంగా అడిగాడు ఎస్.ఐ.

కానిస్టేబుల్ "నేనాపలేదాసార్..." అంటూ ఏదో చెప్పబోయాడు. ఈలోపు విష్ణుమూర్తిగారు కలుగ చేసుకొని



అతని తప్పేంలేదు. అందర్ని చెక్ చేస్తున్నప్పుడు నన్నూ చెక్ చేయాలి. నేనే వచ్చాను" అన్నారు.

"మీరెళ్ళండి సార్! అయినా మీరింత దూరం వచ్చారేంటి సార్!" అడిగాడు ఎస్.ఐ.

"అదిగో! ఆ కాలనీలో వెంకటేశ్వర్రావుగారని ఒక పెద్దాయనుంటున్నారు. మీతరం ఆయన్నెరగరు. నా ఈడు వాళ్ళనెందర్నో ఆయన ప్రభావితం చేశాడు. స్వాతంత్ర్య పోరాటంలో చాలాకాలం జయిల్లో ఉన్నాడు. ఆయనకి ఒంట్లో బాగోలేదంటే చూట్టానికెళ్ళాను" అంటూ చంద్రమోహన్‌వైపు చూశాడు.

"నమస్కారం సార్! ఐయామ్ చంద్రమోహన్! అసిస్టెంట్ ఫిజీషియన్, జి.జి.హెచ్."

"చాలా సంతోషం. సుబ్బారావు బాగున్నాడా? అడిగానని చెప్పు. మరి నేను వెళతాను" అంటూ మోపెడ్ తీశాడు.

ఆయన్ని చూసి ఆగారేమో చాలామంది మూగివున్నారు. అందరి నమస్కారాలు అందుకుంటూ వెళ్ళిపోయారు విష్ణుమూర్తిగారు.

ఎస్.ఐ. మళ్ళీ బుల్లెట్‌నెక్కి కూర్చుని చంద్రమోహన్‌నుద్దేశించి- "మీరు డాక్టరా? మరి ఆ రిజిస్ట్రేషనేంటి? ఆ ఎల్లో బోర్డు చూసి టాక్సీ డ్రైవరనుకున్నాను "మీలాంటివాళ్ళిలా చేస్తే ఎలా? సరె వెళ్ళండి" అన్నాడు.

తను ఎవరో తెలిసిం తర్వాత సారీ చెబుతాడని ఆశించాడు చంద్రమోహన్. కాని ఎస్.ఐ. మాటల్లోగాని స్వరంలోగాని పశ్చాత్తాపం ఏమాత్రంలేదు.

పార్టీలో హుషారుగా ఉండలేకపోయాడు. రాత్రి ఇంటికొచ్చినా సాయంత్రం జరిగిన అవమానమే గుర్తుకొచ్చి మనస్సు దహించేస్తున్నది. ఎందుకిలా జరుగుతోంది? తనకే జరుగుతోందా? ఒకప్పుడు గోవిందిచ్చిన పార్టీకని వెళితే మోటారు సైకిలును లోనికి రానివ్వనని బయటెక్కడైనా పార్క్ చేసుకొని రమ్మని అవమానించాడు హోటల్‌వాడు. తనకు జరిగిన అవమానం మాపుకోడానికా అన్నట్లు కారు వచ్చిం తర్వాత చాలాసార్లు ఆ హోటలుకెళ్ళారు తను, రాణి. అవమానించిన గేట్ కీపరే వంగివంగి సలాములు చేస్తుంటే దహించేస్తున్న అవమానాగ్ని క్షణంపాటు చల్లారినట్లనిపించేది. ఎక్కువెక్కువ టిప్పులిచ్చి వర్కర్లందరూ తనను గుర్తుంచుకొనేలా చేశాడు. అయితే అంతరాత్మ వెక్కిరించేది. హోటల్‌వాళ్ళ రూల్సు ఏమీమార్చుకోలేదు. తనే వాళ్ళ రూల్సుకనుగుణంగా కారులో వెళ్ళాడు. ఇందులో ఎవరు నెగ్గారు? ఒకప్పుడు కారులేక అవమానం జరిగితే ఇపుడా కారు వల్లే అవమానం జరిగింది. ఖర్చు తగ్గుతుందని కక్కుర్తిపడి కారు టాక్సీ కోటాలో తీసుకోవడం మావగారు చేసిన తప్పు. దానికి తను బలయ్యాడు. ఇలాంటి అవమానాలు ముందు ముందు జరక్కుండా ఉండాలంటే ఏం చెయ్యాలి? గోవిందులా పెద్దపెద్ద ఆఫీసర్లతోనూ, పోలీసులతోనూ తను కూడా పరిచయాలు, స్నేహాలు పెంచుకోవాలా? దీనికి అంతె క్కడ? విష్ణుమూర్తిగార్కి జనం బ్రహ్మరథం పట్టారు.. ఆయన రిటైరయిన గుమాస్తాలా ఉన్నాడు. 'నీకేంకావాలో ఆలోచించు' నిన్న చీఫ్ చెప్పిన మాటలు ప్రతిధ్వనించాయి మనసులో.

బట్టలు మార్చుకొని వచ్చిన రాణి "అన్నట్టు మర్చిపోయానండీ" ఉదయం వీర్రాజు వచ్చాడు. పెద్ద ఇల్లు చూడమన్నారట కదా! రెండవవీధిలో ఉందట. కాని అద్దె ఎక్కువ చెబుతున్నారట. మనకిపుడంత ఇల్లు అవసరమంటారా?" చెప్పింది మంచం మీద కూర్చుంటూ.

ఒక్క క్షణం ఆలోచించిన చంద్రమోహన్ "వద్దు ఈ ఇంట్లోనే ఉందాం!" అన్నాడు. ●